గాడి తప్పిన కౌన్సిల్ సమావేశాలు

- పురపాలన అస్తవ్యస్తం
- కుంటు పడుతున్న అభివృద్ధి పనులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు



కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీదేవి, ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి (ఫైల్)

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశాలు ప్రతి నెలాఖరున జరిగేవి. చాలా ఏళ్లుగా ఈ విధంగా కొనసాగుతోంది. ఒక రోజు అటో ఇటో ప్రతి నెల 28వ తేదీ నుంచి 31వ తేదీ లోపు తప్పనిసరిగా సమావేశాలను నిర్వహించే పరిస్థితి మొన్నటి వరకు ఉండేది. కూటమి నేతల ప్రభావం కారణంగా ఈ పరిస్థితి గాడి తప్పింది. ఎప్పుడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరుగుతుందో అంతుచిక్కని పరిస్థితి. తద్వారా అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయి.కౌన్సిల్‌లో అధికార, ప్రతిపక్ష పార్టీలు ఉండటమే ఇందుకు కారణం.

అవిశ్వాసంపైనే వరద దృష్టి

గడిచిన మున్సిపల్ ఎన్నికల్లో మున్సిపాలిటీకి సంబంధించి 41 మున్సిపల్ కౌన్సిలర్ల స్థానాలకు గాను ఒకరు మినహా 40 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు కౌన్సిలర్లుగా ఎన్నికయ్యారు. ఈ కారణంగా ప్రతి నెలా క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించడం, అభివృద్ధి పనులకు సంబంధించి ప్రతిపాదనలు పంపడం, ఆమోదం తెలపడం జరిగేది. అప్పట్లో ఎమ్మెల్యేగా రాచమల్లు శివప్రసాదరెడ్డి ఉండగా, మున్సిపల్ చైర్‌పర్సన్‌గా వైఎస్సార్‌సీపీకి చెందిన భీమునిపల్లి లక్ష్మీదేవి ఉన్నారు. గత ఏడాది జరిగిన ఎన్నికల్లో టీడీపీ తరపున నంద్యాల వరదరాజులరెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందారు. మున్సిపాలిటీపై పట్టు సాధించేందుకు ఆయన అనేక రకాల ప్రయత్నాలు చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీలో ఉన్న పలువురు కౌన్సిలర్లను తమ పార్టీలో చేర్చుకున్నారు. ప్రతిపక్ష పార్టీ నుంచి ఎక్కువ మంది అధికార పక్షం వైపు వలస వెళ్లారు. ఇది ఇలా ఉండగా ఉన్నట్లుండి ఒకే మారు అధికార పక్షం వైపు వెళ్లిన వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు కొద్ది రోజుల్లోనే తిరిగి సొంత గూటికి చేరుకున్నారు. అప్పటి వరకు మున్సిపల్ కౌన్సిల్ అవిశ్వాస తీర్మానంపై ఆశలు పెట్టుకున్న టీడీపీ నేతలు ఈ పరిస్థితి కారణంగా ఒక్క మారుగా డీలా పడ్డారు. వారిలో ఆశలు సన్నగిల్లాయి. ఎన్డీఏ కూటమి తరపున 17 మంది కౌన్సిలర్లు ఉండగా, వైఎస్సార్‌సీపీ తరపున 22 మంది కౌన్సిలర్లతో పాటు ఇద్దరు కోఆప్షన్ సభ్యులు ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ తరపున ఒక కౌన్సిలర్ ఉన్నారు. ఎక్స్ అఫిషియో మెంబర్‌గా టీడీపీ తరపున ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ఉండగా, వైఎస్సార్‌సీపీకి సంబంధించి ఎమ్మెల్సీ ఆర్.రమేష్ యాదవ్ ఉన్నారు. కొత్తగా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని కూడా ఎక్స్ అఫిషియో మెంబర్‌గా చేర్చుకున్నట్లు మున్సిపల్ ఉన్నతాధికారులు ప్రకటించారు. మున్సిపల్ రాజకీయం ఆసక్తికరంగా మారింది.

కూటమి నేతల ప్రభావం

కూటమి నేతల ప్రభావం కారణంగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశాలు గాడి తప్పాయి. ప్రతినెలాఖరున నెలకోమారు జరగాల్సిన కౌన్సిల్ సమావేశాలు అస్తవ్యస్తంగా మారాయి. మున్సిపాలిటీ అభివృద్ధి పనులపై ఈ ప్రభావం పడుతోంది. ఈ ఏడాది జనవరి 31న జరిగిన మున్సిపల్ సమావేశం నుంచి ఇప్పటి వరకు సక్రమంగా సమావేశాలు జరగడం లేదు. జనవరి 31న బడ్జెట్ సమావేశాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నిర్వహించి తర్వాత జరగాల్సిన సాధారణ సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. అయితే ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ఆదేశాలతో ఐదో వార్డు టీడీపీ కౌన్సిలర్ వంగనూరు మురళీధర్‌రెడ్డిని ప్యానల్ చైర్మన్‌గా ఎంపిక చేశామని కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. తాను వాయిదా వేసిన సమావేశాన్ని తిరిగి ఎలా నిర్వహిస్తారని చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి అజెండాపై కోర్టును ఆశ్రయించారు. ఇంత వరకు తదుపరి ఉత్తర్వులు రాలేదు. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి అందుబాటులో లేరనే కారణంతో ఫిబ్రవరిలో అసలు కౌన్సిల్ సమావేశాన్నే నిర్వహించలేదు.

అభివృద్ధి పనులపై ప్రభావం

మార్చి 22న నిర్వహించిన సమావేశానికి అధికారులెవ్వరూ హాజరు కాకపోవడంతో.. మున్సిపల్ చైర్‌పర్సన్ సాయంత్రం వరకు నిరసన దీక్ష చేపట్టారు. స్పందించిన కమిషనర్ మల్లికార్జున 24న సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. 24న జరిగిన కౌన్సిల్ సమావేశానికి ఎన్డీఏ కూటమికి చెందిన కౌన్సిలర్లు ఎవ్వరూ హాజరు కాకపోగా.. వైఎస్సార్‌సీపీకి సంబంధించి 22 మంది కౌన్సిలర్లతో పాటు కోఆప్షన్ సభ్యులు హాజరయ్యారు. గత నెల 9వ తేదీన జరిగిన కౌన్సిల్ సమావేశంలో అభివృద్ధి పనులతోపాటు అనేక అంశాలకు సంబంధించి ఎన్డీఏ కూటమి సభ్యులు డీసెంట్ ఇచ్చారు. ఈ ప్రభావం అభివృద్ధి పనులపై పడింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మళ్లీ కౌన్సిల్ సమావేశం ఎప్పుడు నిర్వహిస్తారో ఇంకా వెల్లడి కాలేదు. మున్సిపాలిటీలో నెలకొన్న రాజకీయ ఒత్తిళ్ల కారణంగా అధికారులు నలిగిపోతున్నారు.


మున్సిపల్ కార్యాలయం

క్లుప్తంగా

పోలీసులది అనుచిత ధోరణి

చాపాడు: పత్రికా స్వేచ్ఛను రాష్ట్ర ప్రభుత్వం హరిస్తోందని వైఎస్సార్‌సీపీ నేత, ఏపీఎస్ ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి అన్నారు. సాక్షి దినపత్రి ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డి విజయవాడ నివాసంలో సెర్చ్ వారెంట్ లేకుండా సోదాలు చేయడం ముమ్మాటికి చట్టాలను ఉల్లఘించడమేనని పేర్కొన్నారు. శుక్రవారం రెడ్యం మాట్లాడుతూ పోలీసులు అనుచితంగా ప్రవర్తించారని తెలిపారు. కూటమి నేతల అవినీతి, అక్రమాలపై వార్తలు రాస్తే, ఎన్నికల హామీలను నెరవేర్చకపోవడాన్ని ప్రశ్నిస్తే వారిపై బెదిరింపులకు పాల్పడడాన్ని ఖండిస్తున్నామని తెలిపారు.

రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

చాపాడు: ముస్లిం మైనార్టీ కార్పొరేషన్ ద్వారా 2025–26 సంవత్సరానికి సంబంధించి మండలంలో 18 యూనిట్లు మంజూరైనట్లు ఎంపీడీఓ వీర కిషోర్ తెలిపారు. అర్హత కలిగిన నిరుద్యోగులు స్వయం ఉపాధి కోసం లక్ష రూపాయల వరకూ కిరాణాదుకాణం, పాన్‌షాపు, చికెన్ షాపు, ఫ్రూట్ షాప్, కూరగాయల మార్కెట్, సైకిల్ షాపు, రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ ఆటో మొబైల్ షాప్స్, లక్ష నుంచి రూ.8 లక్షల వరకూ జనరిక్ మెడికల్ షాప్స్, ఫిట్నెస్ సెంటర్ వంటి వాటి కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ కోరారు.

మైదుకూరు డిపోకు రూ.12లక్షల ఆదాయం

మైదుకూరు: శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన ఉత్సవాల సందర్భంగా బ్రహ్మంగారి మఠానికి బస్సు సర్వీసులు నడిపిన మైదుకూరు ఆర్టీసీ డిపోకు రూ.12లక్షల ఆదాయం వచ్చింది. ప్రతి రోజూ నడుపుతున్న సాధారణ సర్వీసులు కాకుండా 7, 8, 9 తేదీలలో 24 ప్రత్యేక బస్సు సర్వీసులను మైదుకూరు నుంచి బ్రహ్మంగారిమఠానికి నడిపినట్లు డిపో సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ విజయమ్మ తెలిపారు. ఈ సర్వీసులకు దాదాపు రూ.12లక్షలు ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు. గత ఏడాది ఆరాధన ఉత్సవాల్లో రూ.10.87లక్షలు ఆదాయం వచ్చిందని గుర్తుచేశారు.

కళాకారుడికి ప్రశంసాపత్రం


ప్రశంసాపత్రం అందుకుంటున్న యల్లయ్య


పోరుమామిళ్ల : ఎస్వీ యూనివర్సిటీ తిరుపతిలో డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్ వెల్ఫేర్, కల్చరల్ అఫైర్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మన పల్లె జానపదం జాతర అనే కార్యక్రమంలో పోరుమామిళ్ల పట్టణానికి చెందిన చెక్కభజన కోలాటం కళాకారుడు చిత్తారి యల్లయ్యకు ప్రజా కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు జయపాల్ చేతులమీదుగా జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేసి సన్మానించారు. మరుగున పడుతున్న మన పల్లె పాటలను వెలికి తీయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ప్రశంసాపత్రం అందుకున్న యల్లయ్యను పలువురు అభినందించారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం


వధూవరులతో రాచమల్లు

ప్రొద్దుటూరు : మండలంలోని శంకరాపురం గ్రామానికి చెందిన బోడెల బాబుల్ రెడ్డి కుమార్తె రెడ్డి వాణి, జశ్వంత్ రెడ్డి వివాహం శుక్రవారం జరిగింది. ఈ వివాహానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి నూతన వధూవరులను ఆశీర్వదించారు. అలాగే మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఎంపీపీ శేఖర్ యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఖాజా, యువజన విభాగం అధ్యక్షుడు ద్వార్శల గురునాథ్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్బయ్య పాల్గొన్నారు.

పాత అట్లూరులో తాగునీటి సమస్య


నీటి కుళాయి వద్ద క్యూలో ఉంచిన బిందెలు

అట్లూరు : మండలంలోని పాత అట్లూరు గ్రామంలో వారం రోజులుగా తాగునీటి కోసం గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారం రోజుల క్రితం ఈదురుగాలులు, వర్షానికి విద్యుత్ లేక మూడు రోజులుగా నీరు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే నాలుగు రోజులుగా మంచినీటి పథకం కోసం ఏర్పాటు చేసిన మోటారు సక్రమంగా పనిచేయకపోవడంతో నీటి కోసం నానా అవస్థలు పడుతున్నారు. రెండు రోజుల క్రితం మోటారు కాలిపోవడంతో నీటి సమస్య జఠిలమైంది. గ్రామంలో 30 కుటుంబాల వారు నివాసం ఉంటున్నామని,. గ్రామంలో ఎక్కువగా పశువులు ఉన్నాయని రోజూ పశువుల కోసం నీరు ఎక్కువగా అవసరం ఉంటుందని, మోటారు కాలిపోవడంతో నీటి కోసం వ్యవసాయ మోటార్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందని గ్రామస్తులు వాపోతున్నారు. వెంటనే సర్పంచ్, అధికారులు స్పందించి తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అనేక ప్రయోజనాలు


ఉత్తమ రైతులను సన్మానిస్తున్న ఏడీఏ నాగరాజ

అట్లూరు : ప్రకృతి వ్యవసాయంతో అనేక ప్రయోజనాలున్నాయని, ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయ విధానాలను అవలంబించాలని బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ పేర్కొన్నారు. శుక్రవారం బద్వేలు వ్యవసాయ డివిజన్ పరిధిలోని బద్వేలు మండలం బయనపల్లె గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ 2025 క్యాంపెయిన్ నిర్వహించారు. రైతులతో సమావేశం నిర్వహించి నవధాన్య విత్తనాల కిట్లను రైతులకు అందజేశారు. గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విధానాలతో నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఆరుగురు ఉత్తమ రైతులను శాలువా, పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ బద్వేలు వ్యవసాయ డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల్లో 1,814 మట్టి నమూనాలను సేకరించామని, విశ్లేషణ ఫలితాలను త్వరలో రైతులకు అందించి భూసార పరీక్ష ఫలితాలు ఆధారంగా ఎరువుల వాడకం చేపట్టాలని సూచించారు. అనంతరం అబ్బుసాహెబ్‌పేట గ్రామంలోని ప్రకృతి వ్యవసాయ రైతు నారిబోయిన విజయశేఖర్ సాగు చేసిన 4 ఎకరాల పీఎండీఎస్ క్షేత్రాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసి రైతును అభినందించారు. అనంతరం బద్వేలు అర్బన్ రైతు సేవా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి అన్నదాత సుఖీభవ రికార్డులను, అర్హతలను పరిశీలించి సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. వీఏఏ పవన్‌కుమార్, రైతుసేవా కేంద్రం సహాయకురాలు బిందురాణి, స్వయం సహాయక సభ్యులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా విజయోత్సవ ర్యాలీ


ర్యాలీ చేస్తున్న వీహెచ్‌పీ నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్: పాకిస్తాన్‌లోని ఉగ్రవాద శిబిరాలపై భారత్ సైన్యం చేసిన దాడికి మద్దతుగా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఘనంగా విజయోత్సవ బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ రామేశ్వరంలోని ముక్తిరామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద నుంచి గాంధీరోడ్డు, టీబీరోడ్డు, రాజీవ్ సర్కిల్, పుట్టపర్తి సర్కిల్ వరకు నిర్వహించారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు చితిరాల నాగార్జున, విశ్వహిందూ పరిషత్ నాయకులు మారెళ్ల మల్లిఖార్జునరావు నాగమునిరెడ్డి, కాల్వ చలపతి, జింకా మార్కండేయ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం


మాట్లాడుతున్న శ్రీనివాసులరెడ్డి

బద్వేలు అర్బన్ : ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న ప్రభుత్వాలపై పోరాటాలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులరెడ్డి పిలుపునిచ్చారు. జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈ నెల 20న నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని శుక్రవారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల సభా భవనంలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ కార్మికులు ఎన్నో ఏళ్ళు పోరాడి సాధించుకున్న చట్టాలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని, కార్మిక వర్గాన్ని యాజమాన్యాలకు బానిసలుగా మార్చేందుకు నాలుగు లేబర్‌కోడ్‌లను తెచ్చిందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఒక్కరు ప్రతిఘటించాలని కోరారు. సదస్సులో సీఐటీయూ పట్టణ కన్వీనర్ కె.నాగేంద్రబాబు, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు, యూటీఎఫ్ మండల నాయకులు దేవానందం, మస్తాన్, ఆవాజ్ పట్టణ అధ్యక్షుడు అన్వర్‌బాష, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ డివిజన్ కార్యదర్శి కొండయ్య, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు శివకుమార్, హరి, శ్రీనివాసులు, సత్యరాజ్, చిన్ని పాల్గొన్నారు.

మానవ సేవే మాధవ సేవ


అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న దాతలు

ప్రొద్దుటూరు: మానవ సేవే మాధవ సేవ అని వికసిత ఫౌండేషన్ అధ్యక్షురాలు శూలం లక్ష్మీదేవి అన్నారు. వికసిత ఫౌండేషన్, అమ్మ హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో కొత్తూరు నరసరామయ్య, గంగాదేవి కుమారుడు సాహిత్‌కుమార్ 8వ జన్మదిన సందర్భంగా శుక్రవారం స్థానిక మదర్‌థెరీసా వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అరవింద్, అశోక్, గంగయ్య పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న లైబ్రేరియన్ పోస్టుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్యామ్యూల్‌డేవిడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఎంఎల్ఐసీ ఉత్తీర్ణులై ఉండాలని, కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి అని, అనుభవం, నెట్, సెట్, పీహెచ్‌డీ ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, అర్హులైన వారు ఈ నెల 12వ తేదీ సాయంత్రం 5 గంటల లోపల కళాశాల ఆఫీసులో బయోడేటా, సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలను అందజేయాలని తెలిపారు. వివరాలకు 8688192034 నంబరును సంప్రదించాలని కోరారు.

కిషోరి వికాసంపై అవగాహన


కిషోరి వికాసంపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శ్రీనివాస్

ప్రొద్దుటూరు రూరల్: మండలంలోని పెద్దశెట్టిపల్లె గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం కిషోరి వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ.. పునరుత్పత్తి, ఆరోగ్యం, బాల్య వివాహాల వలన కలిగే దుష్పరిణామాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమని ఆరోగ్య పరంగా కూడా మంచిది కాదన్నారు. కిషోరి బాలికలు రుతుక్రమం వచ్చేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాలికలలో యుక్త వయస్సులో వచ్చే మార్పులు తీసుకోవాల్సిన పోషకాహారం గురించి ఆయన వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ, సీహెచ్‌ఓ కృష్ణమ్మ, సూపర్‌వైజర్ వరప్రసాద్, హెల్త్ అసిస్టెంట్లు శ్రీనివాసులు, ఏఎన్ఎంలు సుజాత, లలిత, మహిళా పోలీసు శ్రీలక్ష్మీ, అంగన్వాడీ వర్కర్లు రాజ్యలక్ష్మి, హాజరాబీ, మహాలక్ష్మి, తులసి పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని టీబీరోడ్డు యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో శాస్త్రినగర్‌లోని రజకవాడలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర వికాసం వేసవి శిక్షణా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కిశోర బాలికలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కమ్యూనిటీ కో ఆర్డినేటర్ సుబ్బారెడ్డి, గంగా భవాని, రమణమ్మ, మహిళా పోలీసు యామిని పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ప్రొద్దుటూరు కల్చరల్: తొగటవీర క్షత్రియ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందించనున్నట్లు శ్రీ చౌడేశ్వరిదేవి తొగటవీర క్షత్రియ సేవా సంఘం అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక తొగటవీర క్షత్రియ కల్యాణమండపంలో శుక్రవారం 13న ప్రతిభకు పట్టాభిషేకం కార్యక్రమ ఆహ్వాన పత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని మున్సిపల్, జెడ్పీహెచ్ఎస్, ఎయిడెడ్ పాఠశాలల్లో చదివి 450 పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు, స్థానిక కళాశాలల్లో ఇంటర్ చదివి ప్రతిగ్రూపులో 75శాతం పైగా మార్కులు సాధించిన విద్యార్థులు, ట్రిపుల్ ఐటీలో ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు ప్రథమ బహుమతిగా రూ.4,000, ద్వితీయ బహుమతిగా రూ.3,000, తృతీయ బహుమతిగా రూ.2,500 అందిస్తామన్నారు. సంఘం ఉపాధ్యక్షుడు ఉమ్మడిశెట్టి చౌడయ్య, కోశాధికారి గంజికుంట ఆంజనేయులు, జి.సూర్యనారాయణ, రామయ్య, లక్ష్మీనారాయణపాల్గొన్నారు.

ది బీసీ ప్రజా చైతన్య సమాఖ్య ఆధ్వర్యంలో..

10వ తరగతి, ఇంటర్‌లో ప్రతిభ కనపరచిన బీసీ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందించనున్నట్లు ది బీసీ ప్రజా చైతన్య సమాఖ్య అధ్యక్షుడు బొర్రా రామాంజనేయులు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరు మండలంలో మున్సిపల్, ఎయిడెడ్ జెడ్పీ పాఠశాలల్లో చదివి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు, స్థానికంగా ఇంటర్ చదివి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రథమ బహుమతిగా రూ.5,000, ద్వితీయ బహుమతిగా రూ.4,000ను, ప్రతిభా పురస్కారాలు అందిస్తామని తెలిపారు.

ఘనంగా పోలేరమ్మ రథోత్సవం


అమ్మవారి రథాన్ని లాగుతున్న భక్తులు

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలో పోలేరమ్మ రథోత్సవం ఘనంగా జరిగింది. శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన, గురుపూజోత్సవాల చివరి రోజైన శుక్రవారం ఈ కార్యక్రమం చేపట్టారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి, విశేష పూజలు చేశారు. హోమాలను ఆగమ వేద పండితులు ఇడమకంటి జనార్దన శివాచార్య, పోలేపల్లి రామబ్రహ్మం ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ పూజ కార్యక్రమంలో పూర్వపు మఠాధిపతులు కుమారులు శ్రీ వెంకటాద్రి స్వామి, వీరంబొట్లయ్యస్వామి, దత్తాత్రేయ స్వామి తదితరులు పాల్గొన్నారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రథంపై కొలువుదీర్చారు. భక్తులు పోటీ పడి, రథాన్ని లాగారు. ఆలయ ఆవరణలో రథోత్సవం జరిగింది. ఈ అచలానందస్వామి ఆశ్రమం పీఠాధిపతులు శ్రీ విరజానందస్వామి, ఫిట్‌పర్సన్ శంకర్‌బాలాజి, గ్రామస్తులు ఎస్ఆర్ శ్రీనివాస్‌రెడ్డి, మాధవనాయుడు, బాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

హంస వాహనంపై అగస్త్యేశ్వరుడు


హంసవాహనంపై గంగారాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరుడు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం గంగారాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వర స్వామి ఉత్సవ మూర్తిని హంస వాహనంపై పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు. శుక్రవారం ఉదయం అగస్త్యేశ్వరస్వామికి, రాజరాజేశ్వరిదేవికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. గణపతి పూజ, కలశపూజ, మండపారాధన, దీక్షా హోమాలను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీ నటరాజ నాట్య మండలి ఆధ్వర్యంలో కళాకారులు ప్రదర్శించిన శ్రీ రామాంజనేయ యుద్ధం నాటకం అందరిని ఆకట్టుకుంది. రాత్రి గంగా రాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు విశేష అలంకరణ చేసి హంస వాహనంపై కొలువు దీర్చి శివనామస్మరణల మధ్య పురవీధుల్లో వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు.

శేష వాహనంపై చెన్నకేశవుడు


శేష వాహనంపై ఊరేగుతున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవ స్వామి

రాజుపాళెం : రాజుపాళెం మండలంలోని పుణ్య క్షేత్రమైన వెల్లాల శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వాముల బ్రహోత్సవాలలో భాగంగా శుక్రవారం రాత్రి శేష వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవ స్వాముల విగ్రహాలను పల్లకిపై వైభవంగా పురవీధుల్లో ఊరేగించారు. ముందుగా శ్రీచెన్నకేశవ, సంజీవరాయ స్వాముల వారికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఈఓ వెంకటరమణ, ఉత్సవ కమిటీ సభ్యులు లక్ష్మినారాయణరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రామ్మోహన్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మురళీనాయక్ త్యాగం వృథా కాదు

ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి



పోరుమామిళ్ల : యుద్ధ భూమిలో వీరమరణం పొందిన జవాన్ మురళీనాయక్ త్యాగం వృథా కాదని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా కాశ్మీర్ యుద్ధభూమిలో పోరాడుతూ మన రాష్ట్రానికి చెందిన మురళీనాయక్ వీరమరణం పొందడం తనను తీవ్ర ఆవేదనకు గురి చేసిందని పేర్కొన్నారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గం గోరంట్ల మండలం గడ్డంతాండ పంచాయతీ కల్లితాండా గ్రామానికి చెందిన మురళీనాయక్ చూపిన ధైర్య సాహసాలు రాష్ట్రానికే గర్వకారణమని కొనియాడారు. మురళి తల్లిదండ్రుల ఆవేదన తీర్చలేనిదని.. వారు ధైర్యంగా ఉండాలని పేర్కొన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన అమరుల త్యాగాలు మరవలేమన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించండి


చిన్నారులతో సీడీపీఓ, అధికారులు

రాజుపాళెం : చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ప్రొద్దుటూరు ఐసీడీఎస్ సీడీపీఓ అరుణకుమారి పేర్కొన్నారు. మండలంలోని కూలూరు గ్రామంలోని రెండవ అంగన్‌వాడీ కేంద్రంలో పాఠశాల సంసిద్ధత ఉత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీడీపీఓ మాట్లాడుతూ కేంద్రానికి వచ్చే చిన్నారులను తమ అంగన్‌వాడీ కార్యకర్తలు కంటికి రెప్పలా చూసుకోవడంతో పాటు విద్యాబుద్ధులు నేర్పిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ స్వరూపారాణి, సూపర్‌వైజర్లు రషీదాబేగం, నాగరత్నమ్మ, పంచాయతీ కార్యదర్శి వెంకటయ్య, కార్యకర్తలు శ్రీకళ, మంజేల, అరుణ, రాధ, కళావతి, స్వర్ణలత, ఇంజనీర్ ప్రకాశ్, మహిళా పోలీసు శ్రీలక్ష్మి, ఆయాలు, తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు. అనంతరం వారంతా గ్రామాల్లో ర్యాలీ చేపట్టారు.

రహదారి భద్రతే.. జీవితానికి రక్షణ


వాహనదారుడికి కౌన్సిలింగ్ ఇస్తున్న అర్బన్ సీఐ

మైదుకూరు: రహదారిపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ భద్రతా నిబంధనలు పాటించాలని, రహదారి భద్రతే జీవితానికి రక్షణ అని అర్బన్ సీఐ కె.రమణారెడ్డి తెలిపారు. పట్టణంలో శుక్రవారం సాయంత్రం అర్బన్ సీఐ కె.రమణారెడ్డి వాహనదారులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన రహదారులు, రాయల్, పొట్టిశ్రీరాములు తదితర కూడళ్లలో ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ వాహనాలను నడపాలని సీఐ వాహనదారులకు సూచించారు. పార్కింగ్ స్థలాల్లో ద్విచక్రవాహనాలను పార్క్ చేసినప్పుడు సైడ్ లాక్ తప్పనిసరిగా చేయాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న పలువురికి జరిమానా విధించారు. ఆర్టీసీ బస్టాండ్‌లో నిర్వహిస్తున్న ఎస్ఆర్ కేఫ్‌లో టీ సేవించేందుకు వచ్చిన వారికి ద్వి చక్ర వాహనాల పార్కింగ్‌పై అవగాహన కల్పించారు. కేఫ్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని యజమానులకు సూచించారు. కార్యక్రమంలో అర్బన్ ఎస్ఐ చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణంలో తనిఖీలు

పోరుమామిళ్ల : పట్టణంలోని పలు లాడ్జిల్లో సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కొండారెడ్డి తనిఖీ చేశారు. కొత్తవారు, అనుమానాస్పద వ్యక్తులు ఎవరైనా ఉంటే వారిని గురించి ఆరా తీశారు. అదేవిధంగా ఆర్టీసీ బస్టాండులో కూడా తనిఖీలు ముమ్మరంగా నిర్వహించారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని తెలిపారు.

పోషక లోపం అధిగమిస్తేనే ఆరోగ్యం


గర్భిణులకు సూచనలిస్తున్న వైద్యాధికారి

బి.కోడూరు : గర్భిణులు పోషక లోపాన్ని అధిగమిస్తే ఆరోగ్యంగా ఉంటారని, అందువల్ల పౌష్టికాహారం తీసుకోవాలని బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు, డాక్టర్ ఉదయ్‌కిరణ్ పేర్కొన్నారు. శుక్రవారం బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి నెల 9వ తేదీన పీహెచ్‌సీలో పీఎంఎస్ఎంఏ కార్యక్రమం జరుగుతుందని, గర్భిణులకు తప్పక ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. గర్భిణులకు అన్నిరకాల పరీక్షలు జరిపి హైరిస్క్ ఉన్న గర్భిణులను గుర్తించి తగు సలహాలు, సూచనలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. గర్భిణులు క్రమం తప్పకుండా టీకాలు వేయించుకుని ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఇచ్చే ఐరన్ మాత్రలు వాడాలని సూచించారు. 108 వాహనం ఉపయోగించుకుని ప్రభుత్వాసుపత్రిలో కాన్పు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమానికి వచ్చిన 29 మంది గర్భిణులకు పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ అధికారి పుష్పాంజలి భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆఫ్తాల్మిక్ ఆఫీసర్ హుస్సేనయ్య, హెల్త్ సూపర్‌వైజర్లు జాన్‌విలియం, విజయలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ రామతీర్థం, ల్యాబ్ టెక్నీషియన్ చంద్ర, స్టాఫ్‌నర్సు సునీతమ్మ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, గర్భిణులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

దువ్వూరు : గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని దువ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సురేష్ బాబు తెలిపారు. శుక్రవారం దువ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి మాతృత్వ సురక్షిత అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్లు సురేష్ బాబు, రోష్ని, హేమలత గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. గ్రామాల్లో గర్భిణులను గుర్తించి ప్రభుత్వ ఆసుపత్రిలో సుఖ ప్రసవం అయ్యేలా చూడాలని డాక్టర్లు ఆశా కార్యకర్తలకు సూచించారు. ప్రతి నెల వైద్య పరీక్షలు చేయించుకొని డాక్టర్ల సూచనల మేరకు మందులు వాడాలని డాక్టర్లు తెలిపారు. రక్తహీనత ఉన్న వారు అంగన్వాడీ కేంద్రంలో ఇచ్చే చిక్కీలు కోడిగుడ్లు పాలు, ఖనిజ లవణాలు, కాల్షియం ఎక్కువగా ఉండే రాగి జావా ఇతర పోషకాహారాలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ఆకుకూరలు క్రమం తప్పకుండా ప్రతిరోజు తినే ఆహారంలో తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్లు రాజగోపాల్, సువర్ణ, విజయ్ కుమారి మండలంలోని ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.